


https://www.tholikranthidaily.in TEL TEL - 12281

# తొలిక్రాంతి


మన గొంతుకకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక..

హైదరాబాద్
శనివారం
26-07-2025

వెల రూ.4/-
సంపుటి: 01 సంచిక: 40
పేజీలు: 04

Published From: Hyderabad
Editor: Malothu Chandrakala

# పొరుగువారిమే కాదు..
# మేలు కోరేం వాళ్లం..

- గార్డ్ ఆఫ్ హానర్ తో రెడ్ కార్పెట్ స్వాగతం
- అధ్యక్షుడు మొయిజ్జుతో ద్వైపాక్షిక చర్చలు
- రక్షణ, సముద్ర, ప్రాజెక్టుల నిర్వహణపై వ్యూహాత్మక ఒప్పందాలు
- రూ.4,850 లైన్ ఆఫ్ క్రెడిట్ అందజేత డ్రాగన్ ప్రభావాన్ని తగ్గించేందుకు పటిష్ట చర్యలు

మాలే, జూలై 25-(తొలి క్రాంతి):

తాము కేవలం పొరుగువారిమే కాదని, మాల్దీవులు మేలుకోరే వారిమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారతీయులందరి తరఫున ప్రధాని నరేంద్ర మోదీ మాల్దీవుల ప్రజలకు, అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జుకు 60వ స్వాతంత్ర్య దినోత్సవ (మిగతా 2లో..)



## రాజకీయ ఒత్తిడికి తలొగ్గొద్దు

- సీడీపీవోలు మహిళా శిశు సంక్షేమ శాఖ వెన్నెముక లాంటివారు
- అంగన్‌వాడీ సేవలు పేద ప్రజలకు ఎంతో అవసరం:మంత్రి సీతక్క

హైదరాబాద్ జూలై25(తొలి క్రాంతి):

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు అంగన్ వాడీలను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని మంత్రి సీతక్క అన్నారు. ఇందులో భాగంగా అనేక మార్పులు తీసుకువస్తు న్నామని చెప్పారు. ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా నూతనంగా చైల్డ్ డెవలప్ మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లుగా ఎంపికైన 23 మందికి ఇవాళ సచివాలయంలో మంత్రి సీతక్క నియామక పత్రాలు అందజేశారు. (మిగతా 2లో..)



## దళిత వ్యతిరేక ప్రభుత్వాన్ని
# గద్దె దించుదాం

- సాయిలన్నపై దాడికి బదులు తీర్చుకుందాం
- ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మ్యానిఫెస్టో
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కి గుణపాఠం చెప్పాలి
- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం అమలు చేయకపోవడం దుర్మార్గం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ జూలై25(తొలి క్రాంతి):

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తన పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిప డ్డారు. కామారెడ్డి జిల్లా లింగంపేటలో నిర్వహిం చిన ఆత్మ గౌరవ గర్జన కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు ముఖ్యంగా రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దళిత, గిరిజన హక్కులను పక్కనపెట్టి వ్యవహరిస్తోందని ఆయన తీవ్ర విమర్శలు చేశా రు. “ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం తెలంగాణ కాంగ్రెస్ మ్యానిఫెస్టో. దళితులు, గిరిజనులు, రైతులు, ఉద్యోగార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రభుత్వ చేతిలో తీవ్రంగా మోసపోయారు,” అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఖర్గే సమక్షంలో ఏఐసీసీ ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం (మిగతా 2లో..)



## రేవంత్‌రెడ్డికి భాస్కర్ అవార్డు ఇవ్వాలి

- నోబెల్ కాదు..గోబెల్స్ ప్రచారం ప్రైజ్ ఇవ్వొచ్చు
- దత్తాత్రేయ ఉపరాష్ట్రపతి చేయాలని కోరడం సంతోషం
- పొన్నం లేదా మహేష్‌కుమార్‌ను సీఎంగా చేయాలి
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు

2

## మోదీ కులంపై వ్యాఖ్యలా..?
# రాహుల్‌ది ఏ కులం?

- సీఎం రేవంత్ రెడ్డిది మిడిమిడి జ్ఞానం
- చిత్తశుద్ధి ఉంటే పదవికి రాజీనామా చేసి బీసీని ముఖ్యమంత్రిని చేయాలి
- బీసీ రిజర్వేషన్లు.. హామీ ఇచ్చి విస్మరిస్తారా?
- 42ను 32 చేసి బీసీలకు అన్యాయం చేస్తారా?
- 50 డివిజన్లను 30 మజ్లిస్‌కు కేటాయిస్తారా
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి




హైదరాబాద్ జూలై25(తొలి క్రాంతి):

అత్యధిక ప్రధానమంత్రి పదవిలో 4,078 రోజులతో రెండోస్థానంలో నిలిచి, ఇందిరాగాంధీ రికార్డులను అధిగమించిన ప్రధాని మోదీకి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక నూతన మైలురాయిగా అభివర్ణించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రకటించిం దని అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు. రెండేళ్లు గడుస్తున్నా ఆ పార్టీకి ఇప్పటికే స్పష్టమైన అవగాహన లేదన్నారు. ప్రస్తుతం యూటర్న్ తీసుకొని 32 శాతమే బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామనడం తీవ్ర అన్యాయమన్నారు. బీసీ-ఇ పేరుతో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడు, హైకోర్టు ఈ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని, చెల్లవని రెండు సార్లు తీర్పు ఇచ్చిందన్నారు. కానీ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు స్టేతో కొనసాగిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ 4 శాతాన్ని 10 శాతానికి పెంచి, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తున్నామంటూ మభ్యపెడుతుందని, తప్పుదారి పట్టిస్తుందని ఆరోపించారు. సర్వే పేరుతో బీసీ జనాభాను తక్కువగా చూపించే ప్రయత్నం చేసిందన్నారు. 56 శాతం ఉన్న బీసీల్లో 10 శాతం ముస్లింలను కలిపి, 46 శాతం మాత్రమే బీసీలు ఉన్నట్లు ప్రకటించిందని ఆరోపించారు. న్యాయబద్ధంగా అమలయ్యే అవకాశం లేని 10 శాతం ముస్లిం రిజర్వేషన్లను బీసీ రిజర్వేషన్లలో కలపాలని రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ప్రయత్నించడం నిజమైన బీసీలకు అన్యాయం చేయడమేనని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.హైదరాబాద్ నగరంలో (మిగతా 2లో..)

## జనగణన తర్వాతే
# డీలిమిటేషన్

- ఏపీ, తెలంగాణ డీలిమిటేషన్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

హైదరాబాద్ జూలై25 (తొలి క్రాంతి):

ఏపీ, తెలంగాణ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజనపై ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి 2022లో పిటిషన్ దాఖలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో పునర్విభజన సమయంలో.. ఏపీ విభజన చట్టాన్ని పక్కన పెట్టేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ రోజు విచారణ చేపట్టింది. (మిగతా 2లో..)





2

## బీజేపీ-బీఆర్ఎస్ ద్వంద వైఖరి

- బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం మోసం చేస్తే ఊరుకునేది లేదు
- కేంద్రానికి పంపిస్తే.. బీజేపీ దాన్ని ఆపిందని.. ఇది సరైంది కాదు
- మంత్రి కొండా సురేఖ




2

## హీరోయిన్ల ఫోన్లను ట్యాప్ చేస్తుండ్రు

- రేవంత్ రెడ్డి రాత్రి 2 గంటలకు.. మై హెూమ్ భుజాలో ఏ హీరోయిన్ వద్దకు వెళ్తున్నావో అందరికీ తెలుసు
- చివరికి అందాల పోటీలకు వచ్చిన సుందరీమణుల ఫోన్లను ట్యాప్
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

తొలిక్రాంతి

శనివారం
26 జులై 2025

# దళిత వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

(మొదటి పేజీ తరువాయి..)

అమలు చేయకపోవడం దళితుల పట్ల చేసిన అత్యంత దుర్మార్గమైన తీరని కేటీఆర్ ఆరోపించారు. దళిత బంధు పేరుతో కేసీఆర్ రూ.10 లక్షల సహాయాన్ని ఇవ్వగా, కాంగ్రెస్ రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు. అదే విధంగా అన్ని ప్రభుత్వ పనుల్లో 26% రిజర్వేషన్, ఇండ్లు కట్టుకునే దళిత, గిరిజనులకు రూ.6 లక్షల నిధుల వంటి హామీలన్నీ కేవలం మాయాజాలంగా మిగిలిపోయాయని పేర్కొన్నారు. కేటీఆర్ అభిప్రాయంలో కేసీఆర్ చేసిన సేవలు గణనీయమైనవని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను గౌరవించేందుకు 125 అడుగుల విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం తెలంగాణ సెక్రటేరియట్‌కు అంబేద్కర్ పేరు పెట్టడం దేశంలో ఎక్కడా లేనివిధంగా జరిగిన అరుదైన ఘట్టాలని చెప్పారు. కేసీఆర్ దళిత బంధు వంటి పథకాలు లక్షలాది మంది పేదల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని ఆయన స్పష్టం చేశారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న తీరుపైనా తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండు పంట సీజన్లలో రైతుబంధును ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడిన తర్వాత మాత్రమే ఇచ్చిన తీరు దారుణమని వ్యాఖ్యానించారు. కేసీఆర్ రూ.10,000 ఇస్తే, తాము అధికారంలోకి వచ్చాక రూ.15,000 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు ఆ హామీ కూడా మరిచిపోయిందని చెప్పారు. అలాగే పెన్షన్‌ను రూ.4,000 చేస్తామన్నారు కానీ ఇప్పటికీ రెండువేలే ఇస్తున్నారని, కేసీఆర్ ఇంట్లో ఒక్కరికి మాత్రమే పెన్షన్ ఇస్తున్నాడని తప్పుపడుతూ, తాము అధికారంలోకి వస్తే అత్త, కోడలికి విడివిడిగా రూ.4,000, రూ.20,000 ఇస్తామని చెప్పిన వారు ఇప్పుడు నిశ్శబ్దంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. అంతేకాక యువతకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ పైన కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్న ప్రభుత్వం, కేసీఆర్ హయాంలో జరిగిన నియామకాలకు తాము జీత పత్రాలు ఇచ్చామని పొగిడుకుంటున్నారని పేర్కొన్నారు. ఇదే పరిస్థితిలో విద్యార్థులకు విషభోజనాలు అందుతున్నాయి రెసిడెన్షియల్ స్కూళ్లలో ఇప్పటికే వందల మంది విద్యార్థులు బలి అయ్యారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాధనాన్ని పాక్యంగా వాడుకుంటోందని వేములవాడలో ఒక్క భోజనం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయడం అయితే గురుకుల విద్యార్థులకు తినేందుకు పోషకాహారాన్ని కూడా అందించలేకపోవడం అన్యాయం అన్నారు. "ప్రభుత్వాన్ని నడిపించేందుకు ధైర్యం ఉన్నవారికే ఆదాయం పెంచే శక్తి ఉంటుంది పేదల మధ్య ఆ సంపదను పంచే తెలివి ఉంటుంది. కానీ ఇప్పుడు సంపద 'రాహుల్ గాంధీ ఖాతాలో'నే పడుతోంది అని వ్యంగ్యంగా చెప్పారు. ఇలాంటి ప్రభుత్వ నిర్లక్ష్యం, అబద్ధాల పాలన నుంచి ప్రజలు బయటపడాలంటే ప్రజాస్వామ్యంలో ఓటు అనే తూటాను వినియోగించాల్సిన సమయం ఆసన్నమైందని కేటీఆర్ పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ తను గుణపాఠం చెప్పాలని కోరారు. తెలంగాణలో మరోసారి శాంతి, అభివృద్ధి, సంక్షేమ పాలనను తెచ్చేందుకు కేసీఆర్ నాయకత్వం అనివార్యమని స్పష్టం చేశారు.



## జనగణన తర్వాతే డీలిమిటేషన్

(మొదటి పేజీ తరువాయి..)

రాజ్యాంగంలోని 170(3) అధికరణం ప్రకారం ఏపీ విభజన చట్టంలోని సెక్షన్ 26కు పరిమితి ఉందని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. 2026లో మొదటి జనగణన లెక్కల తర్వాతే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది. ఇలాంటి వ్యాజ్యాన్ని అనుమతించడం వల్ల మిగతా రాష్ట్రాల నుంచి కూడా నియోజకవర్గాల పునర్విభజనపై పిటిషన్లు వచ్చే అవకాశం ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. కేంద్రపాలిత ప్రాంతాలతో పోల్చినప్పుడు రాష్ట్రాలలో డీలిమిటేషన్‌కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉంటాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. జమ్మూకశ్మీర్‌పై ప్రత్యేక దృష్టిసారించారన్న వాదనను కూడా ధర్మాసనం తిరస్కరించింది. జమ్మూకశ్మీర్ కోసం జారీ చేసిన నియోజకవర్గాల పునర్విభజన నోటిఫికేషన్ నుంచి మినహాయించడం.. ఏకపక్షం, విపక్షం కాదని చెబుతూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

## రాజకీయ ఒత్తిడికి తలొగ్గొద్దు

(మొదటి పేజీ తరువాయి..)

ఈ సందర్భంగా నూతన సీడీపీవోలకు అభినందనలు తెలిపిన సీతక్క.. సీడీపీవోలు మహిళా శిశు సంక్షేమ శాఖ వెన్నెముక లాంటివారని మీరంతా ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు లొంగాల్సిన అవసరం లేదన్నారు. స్వేచ్ఛగా అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సేవా దృక్పథంతో, మానవతతో పనిచేసే శాఖ అని అన్నారు. వేల మంది పోటీ పడితే మీ 23మంది ఉద్యోగాలు సాధించారు. మా శాఖలో ఇది కొత్త తరం అని చెప్పారు. ఉన్నత విద్యావంతులైన మీరు మా శాఖలో చేరటం అభినందనీయం అన్నారు. చిన్నారులు, గర్భిణీలు బాలింతలకు సేవ చేసే అదృష్టం మీకు దక్కిందని.. శిశువులు మహిళల సంరక్షణతో పాటు దత్తత ప్రక్రియ, మహిళా సాధికారత వంటి అంశాలను నిర్వర్తించాల్సి ఉంటుందని సూచించారు. అంగన్ వాడీ సేవలు పేద ప్రజలకు ఎంతో అవసరం అని లబ్ధిదారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించే బాధ్యత మీదేనన్నారు. అంగన్ వాడీలకు 57 రకాల ఆట వస్తువులు ఇచ్చామని, వారంలో రెండు రోజులు ఎగ్ బిర్యాని పెడుతున్నామని చెప్పారు. పోషకార లోపాన్ని తగ్గించేందుకు పాలు గుడ్లు క్రమం తప్పకుండా సరఫరాతో పాటు చిన్నారులకు యూనిఫామ్స్ కూడా ఇస్తున్నామన్నారు. అంగన్ వాడీలలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సేవలను లబ్ధిదారులకు అందజేయాల్సిన బాధ్యత మీదేనని అందువల్ల మీరు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా ఫీల్డ్ విజిట్ చేయాలని సూచించారు. అంగన్ వాడీ సేవలు మెరుగుదలకు మీరు సలహాలు సూచనలు ఇవ్వవచ్చని తెలిపారు.

## రేవంత్‌రెడ్డికి భాస్కర్ అవార్డు ఇవ్వాలి

హైదరాబాద్ జూలై25(తొలి క్రాంతి):

మీడియాతో చిట్ చాట్ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి ఆస్కార్ అవార్డు కాదు, భాస్కర్ అవార్డు ఇవ్వాలి.. నోబెల్ ప్రైజ్ కాదు, గోబెల్స్ ప్రైజ్ ఇవ్వాలి అంటూ సెటైర్లు వేశారు. నరేంద్ర మోడీ సీఎం అయ్యే ముందు నుంచే బీసీ.. అప్పటి నుంచి ఎన్నో కులాలు బీసీల్లో కలిసిపోయినట్లు గుర్తు చేశారు. ఇక, రాహుల్ గాంధీ తల్లి తండ్రులు వేర్వేరు మతాలకు చెందినవారు, ఆయన కులం ఏంటి?" అని ప్రశ్నించారు. అయితే, పార్టీలో పోస్టుల కోసం ఒత్తిడి చేయొద్దు అన్నారు. మనం అందరం పార్టీ కార్యకర్తలమే, పదవులు వచ్చినవారు ఎక్కువ కాదు, రాని వారు తక్కువ కాదని వెల్లడించారు. వారం రోజుల్లో పార్టీ కొత్త కమిటీని ప్రకటిస్తుంది.. అందులో మొత్తం 20 మందిని నియమిస్తాం.. 33 శాతం మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని రామచందర్ రావు చెప్పుకొచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇచ్చిన సూచనల మేరకు పార్టీ నేతలు ఎక్కువ టూర్లు చేయాలని, కార్యకర్తల్ని కలవాలని రామచందర్ రావు పేర్కొన్నారు. పార్టీ అంతర్గత సమస్యలు కుటుంబ సమస్యల వంటివే, వాటిని బయటకు తీసుకురావద్దు అన్నారు. అలాగే, దత్తాత్రేయని వైస్ ప్రెసిడెంట్ చేయమన్నట్టే, మేము కూడా పొన్నం ప్రభాకర్‌ను లేదా మహేష్ గౌడ్‌ను సీఎం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.. బీజేపీ బీసీ పక్షపాతి.. బీసీలను పార్టీకి దూరం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు.. మేము 42 శాతం రిజర్వేషన్‌కు సపోర్టు ఇస్తున్నాం.. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కేంద్రంపై నెట్టవద్దని, రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని వెల్లడించారు. బీజేపీలో ఉన్న రెడ్డి నేతలెవరూ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా లేరని, పార్టీ లీడర్ మహేశ్వర్ రెడ్డి కూడా ఈ విషయాన్ని తెలియజేశారని రామచందర్ రావు చెప్పారు.

## బీజేపీ బీఆర్ఎస్ ద్వంద వైఖరి

హైదరాబాద్ జూలై25(తొలి క్రాంతి):

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం మోసం చేస్తే ఊరుకునేది లేదని మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. ఒక బీసీ మంత్రిగా.. బీసీ బిడ్డగా.. ఈ విషయంలో కపట వైఖరిని బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు అవలంభిస్తే.. తాము ప్రజల్లో ఎండగడతామని మంత్రి సురేఖ వార్నింగ్ ఇచ్చారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్‌లతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. బీసీ బిల్లును తాము అసెంబ్లీలో ప్రవేశపెట్టి.. కేంద్రానికి పంపిస్తే.. బీజేపీ దాన్ని ఆపిందని.. ఇది సరైంది కాదన్నారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి దగ్గర ఉందని చెప్పారు. అయితే దాన్ని ఒప్పుకుంటారా? లేదో రాష్ట్ర ప్రజలకు బీజేపీ కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని సురేఖ డిమాండ్ చేశారు. బీసీలను మోసం చేసే కార్యక్రమాలు చేయొద్దని బీజేపీని ఆమె హెచ్చరించారు. కాగా తమ సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతవర్గానికి చెందిన నాయకుడైనా.. ఆయా వర్గాలను ఒప్పించి బీసీ హక్కులను కాపాడేందుకు చర్యలు తీసుకున్నట్టు వివరించారు. ఈ దేశంలో దళితులు, గిరిజనులకు రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలోని కూడా తాము ముస్లింలకు రిజర్వేషన్ ఇచ్చామని గుర్తుచేశారు. ఇప్పుడు బీసీలకు రిజర్వేషన్లు ఇస్తున్నది కూడా మేమే అని మంత్రి సురేఖ వివరించారు. సమాజంలో వెనకబడిన వర్గాలు, నిమ్నవర్గాలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీకి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు, బీసీ మంత్రులతో పాటు నిపుణుల కమిటీ.. ఖర్గే, రాహుల్ గాంధీలతో భేటీ జరిగిందని గుర్తుచేశారు. ఈ భేటీలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనపై కాంగ్రెస్ అగ్రనాయకత్వం పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసినట్టు వివరించారు. బీఆర్ఎస్ బీసీ కులగణనలో అసలే పాల్గొనలేదని.. వారికి బీసీలపై ప్రేమ ఉండే అవకాశం లేదని మంత్రి విమర్శించారు. ఇప్పటికైనా బీసీలపై బీజేపీ, బీఆర్ఎస్ ద్వంద వైఖరి వీడాలని.. సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని ఆ రెండు పార్టీల నేతలకు సూచించారు.

## పొరుగువారిమే కాదు..
# మేలు కోరేవారం!

(మొదటి పేజీ తరువాయి..)



శుభాకాంక్షలు తెలిపారు. మాల్దీవుల అభివృద్ధికి, పురోగతికి భారత్ పూర్తి సహాయ సహకారాలందిస్తుందని స్పష్టం చేశారు. మాల్దీవులు చేరుకున్న ప్రధానికి అధ్యక్షుడు మొయిజ్జు ఘన స్వాగతం పలికారు. అనంతరం రిపబ్లిక్ స్క్వేర్ వద్ద ప్రధాని మోదీకి గార్డ్ ఆఫ్ హానర్ ఘన స్వాగతం లభించింది. రెండుదేశాల మధ్య 60 ఏళ్ల బంధాలకు గుర్తుగా తపాలాబిళ్లను విడుదల చేశారు. ప్రధాని మోదీ ఆరు కమ్యూనిటీ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. జూలై 26 (శనివారం) 60వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శుక్రవారం ఆ దేశ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ఇరుదేశాల్లో ద్వైపాక్షిక చర్చల అనంతరం మాట్లాడారు. ఈ యేడాది భారత్%-%మాల్దీవులు రాజకీయ సంబంధాలకు 60 ఏళ్లు పూర్తయ్యాయన్నారు. ఇరుదేశాల బంధాలు సముద్రం కంటే లోతైనవన్నారు. తాము కేవలం పొరుగువారిమే కాదని, మేలు కోరేవారిమన్నారు. ఇక్కడి లేబర్ పాలసీ, మహాసముద్రం విధానాలపై అనేక బంధాలున్నాయన్నారు. భారత్ క్లిష్ట సమయాల్లో మాల్దీవులు వెంట నిలిచిందని గుర్తు చేశారు. కోవిడ్ లాంటి క్లిష్ట సమయంలో పొరుగుదేశానికి ఆపన్నహస్తం అందించామన్నారు. గతేడాది మొయిజ్జు పర్యటన సందర్భంగా పలు రంగాలలో పరస్పర సహకారం అందించుకోవాలని నిర్ణయించామన్నారు. ఆర్థిక, సముద్ర భద్రత విజన్ లపై సహకారం అందించుకోవాలని నిర్ణయించామన్నారు. దీంతో ఇరుదేశాల మధ్య బంధాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. గ్రేటర్ మాలే కనెక్టివిటీ ప్రాజెక్ట్, రోడ్ డెవలప్ మెంట్ ప్రాజెక్టుతో ఈ ప్రాంతం ఆర్థిక క్షేత్రంలో మరింత లబ్ధి పొందుతుందని అన్నారు. వేర్వేరు ద్వీపాలలో రాకపోకలు మరింత మెరుగవుతాయన్నారు. ఇరుదేశాల డెవలప్ మెంట్ 565 మిలియన్ డాలర్లు (రూ. 4850 కోట్లు) లైన్ ఆఫ్ క్రెడిట్ ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. స్థానిక కరెన్సీ ద్వారా వ్యాపార లావాదేవీలు, వాణిజ్యం నిర్వహించనున్నామన్నారు. రక్షణ, వ్యూహాత్మక రంగాలలో ఒప్పందాలు జరిగాయని వివరించారు. దీంతో ఇరుదేశాల ఆర్థిక బంధాలు మరింత బలోపేతం అవుతాయని వివరించారు. హిందూ మహాసముద్రంలో శాంతి, స్థిరత్వం, సమృద్ధి తమ లక్ష్యమన్నారు. క్లైమెట్ ఛేంజ్ ఇరుదేశాలకు సవాల్ గా నిలుస్తోందన్నారు. ఈ ప్రాంతంలో రీన్యూవబుల్ ఎనర్జీని పెంచుకోవాలని నిర్ణయించామని ప్రధాని మోదీ వివరించారు. మాల్దీవులు భారత్ కు వ్యూహాత్మక ప్రాముఖ్యత గల ప్రాంతంగా నిలుస్తుంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారతదేశానికి కీలకమైన పొరుగు దేశం. ఈ పర్యటన ద్వారా నైబర్‌హుడ్ ఫస్ట్, విజన్ సాగర్ ను బలోపేతం చేస్తుంది. ఇది ప్రాంతీయ స్థిరత్వం, సముద్ర భద్రతను లక్ష్యంగా చేసుకుంది. దీంతో చైనా కుయుక్తులకు చెక్ పెట్టే అవకాశం ఉంది. మాల్దీవులు సముద్ర ప్రాంతంలో డ్రాగన్ పెరుగుతున్న ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహంలో భాగం. పర్యాటక రంగం కూడా బలోపేతం అవుతుంది. గతంలో బెడిసికొట్టిన బంధాలు 2023 దుబాయ్ లో జరిగిన యూఎన్ కాప్ 28 ద్వారా మెరుగుపడ్డాయి. దీంతో ప్రస్తుతం ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతానికి దారితీశాయి.

## మోదీ కులంపై వ్యాఖ్యలా.. రాహుల్‌దీ ఏ కులం?

(మొదటి పేజీ తరువాయి..)

150 మున్సిపల్ డివిజన్లలో 50 డివిజన్లు బీసీలకు రిజర్వ్ చేయగా, ఆ 50 సీట్లలో 30 సీట్లు మజ్లిస్ పార్టీకి కేటాయించారు. ఇప్పుడు మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రతి బీసీ సీటులోనూ ముస్లింలు పోటీ చేసేలా అవకాశం కల్పించడం బీసీలకు అన్యాయం చేయడమే అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో డబ్బా కొట్టుకుంటూ, రాహుల్ బల్లలు చర్చుకుంటే ఈ విషయంలో బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు. బీసీ స్థానాల్లో గెలిచిన మజ్లిస్ కార్పొరేటర్లు కోట్లాది రూపాయలకు పడగలెత్తారని అన్నారు. సామాన్య బీసీలు వారితో ఎలా పోటీపడగలరని నిలదీశారు. అసదుద్దీన్ ఓవైసీ, షబ్బీర్ అలీ, అజారుద్దీన్ లాంటి ముస్లిం నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు ఈ రిజర్వేషన్లను ప్రతిపాదించిందని విమర్శించారు. దశాబ్దాలుగా పాలించిన హస్తం బీసీ జనగణనపై ఆసక్తి ఎందుకు చూపలేదని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు. భారత రాజ్యాంగం 243(డి) ప్రకారం, రిజర్వేషన్ల అమలుకు పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉందని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య భారతంలో మొట్టమొదటిసారిగా జనగణనతో పాటు కులగణన చేయాలని నిర్ణయం తీసుకున్నది మోదీ ప్రభుత్వమేనన్నారు. ఈ గణన సర్వే రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. 1947 నుంచి ఇప్పటివరకూ ఏ ఒక్క బీసీ వ్యక్తినైనా ముఖ్యమంత్రిని చేసిన చరిత్ర కాంగ్రెస్ కుందా? అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వమే బీసీ కమిషన్‌ను చట్టబద్ధం చేసి, కేంద్ర మంత్రివర్గంలో అధికంగా బీసీ మంత్రులకు అవకాశమిచ్చిందన్నారు. మోదీ బీసీల్లో చేరారని మిడిమిడి జ్ఞానంతో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాహుల్ గాంధీ ఏ సామాజిక వర్గానికి చెందిన వారో చెప్పాలని డిమాండ్ చేశారు. లంబాడీలను కన్వర్టెడ్ ఎస్టీ అంటారా? అని నిలదీశారు. కులాల పేరుతో రాజకీయ విమర్శలు చేసి ఆనక చేతులు కాల్చుకొని న్యాయస్థానాల్లో క్షమాపణలు చెప్పిన ఉదాహరణలు అనేకం ఉన్నాయన్నారు. అయినా వీరిలో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. వరుసగా మూడోసారి రాహుల్ నాయకత్వాన్ని దేశ ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఆత్మవిశ్వాసం కోల్పోయిన ఏది పడితే అది మాట్లాడుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. భవిష్యత్ లో తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ లలో కాంగ్రెస్ ఓడిపోనుందని చెప్పారు. ఢిల్లీ ఎన్నికలు ఖాతా తెరవలేక చతికిలపడిందన్నారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే మతపరమైన 10 శాతం ముస్లిం రిజర్వేషన్లను, అలాగే ప్రస్తుతం ఉన్న 4శాతం ముస్లిం రిజర్వేషన్లను పూర్తిగా రద్దు చేసి, వాటిని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వర్తించేలా చేస్తామని హామీ ఇచ్చారు. రాజ్యాంగం ప్రకారం మతపరమైన రిజర్వేషన్లకు చోటు లేదన్నారు. బీసీని ఉపరాష్ట్రపతిగా చేయాలని డిమాండ్ చేస్తున్న రేవంత్ రెడ్డి, నిజంగా బీసీల పట్ల చిత్తశుద్ధిగా ఉంటే ముందు ఆయనే తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఒక బీసీని సీఎంగా నియమించాలని ఆ తర్వాత సుద్దులు చెప్పాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చురకలంటించారు.

## హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేస్తుండ్రు

హైదరాబాద్ జూలై25(తొలి క్రాంతి):

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ముఖ్యమైన ఆరోపణలు, విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు చేస్తూ, ఆయన వ్యవహారశైలిపై పలు సంచలనాత్మక వ్యాఖ్యలు చేశారు. కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్రాన్ని కుదిపేస్తోందని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి "ఫోన్ ట్యాపింగ్ కామన్" అంటూ ఢిల్లీలో చిట్‌చాట్‌లో అన్నారని ఆరోపించారు. అంతేకాదు రేవంత్ రెడ్డి స్వయంగా తమ ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని చెప్పడం శోచనీయం అని అన్నారు. సీఎం కార్యాలయమూ ప్రభుత్వ వ్యవస్థ కూడా ఈ చట్ట విరుద్ధ చర్యలతో కలసిపోవడం విషాదకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మొత్తం 118 మంది ఎమ్మెల్యేలు 17 మంది ఎంపీలు, కాంగ్రెస్ బీజేపీ బీఆర్ఎస్ నేతల ఫోన్లను కూడా ట్యాప్ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యకలాపాల్లో ప్రైవేట్ ఫోన్ హ్యాకర్లను వినియోగిస్తున్నారని, సినిమా హీరోయిన్ల ఫోన్లను కూడా ట్యాప్ చేయిస్తూ వారికి బ్లాక్‌మెయిల్ చేసే స్థాయికి రేవంత్ రెడ్డి దిగజారారని తీవ్ర ఆరోపణ చేశారు. మిస్ వరల్డ్ పోటీల కోసం వచ్చిన విదేశీ అతిథుల ఫోన్లను కూడా ట్యాప్ చేయడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పరువు దెబ్బతీసిందని మండిపడ్డారు. గత డిసెంబర్ 5న తన ఫోన్ ట్యాపింగ్ అవుతుందని పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇంకా కేసు నమోదు చేయకపోవడాన్ని ప్రశ్నించారు. తన సతీమణి ఫోన్ కూడా ట్యాప్ చేయబడుతోందని, ఇక మంత్రులు, ఎమ్మెల్యేలు భర్తాభార్యల మధ్య జరిగే మాటల దాకా రికార్డు చేయడం తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన అని పేర్కొన్నారు. ఇద్దరు మంత్రులు మాట్లాడిన మాటలను ట్యాప్ చేసి మంత్రిని పిలిపించి రేవంత్ రెడ్డి మాట్లాడిన ఘటనను ఉదహరించారు. ఈ చర్యలు అత్యంత గోప్యమైన సమాచారాన్ని అక్రమంగా వినడం ద్వారా శాసనసభ వ్యవస్థపైనే దెబ్బ తీసే చర్యలు కావన్నారు. రాష్ట్రంలో చర్చలు జరగాల్సిన క్యాబినెట్ సమావేశం రద్దు చేయబడటం వెనక కారణం కూడా ఫోన్ ట్యాపింగ్ కలకలం అని పేర్కొన్నారు. మంత్రులు ఢిల్లీలో కూర్చొని రేవంత్ రెడ్డి చర్యలపై తాడోపేడో తేల్చుకుంటామని, కొందరు మంత్రులు రాహుల్ గాంధీ, సోనియా గాంధీకి ఫిర్యాదు కూడా చేశారని తెలిపారు. కేంద్ర సంస్థలు అయిన సీబీఐ, ఈడీలను రాష్ట్ర ప్రభుత్వంపై విచారణకు రంగంలోకి దించాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు తమ పాలనలో ఎప్పుడూ ఫోన్ ట్యాపింగ్ వంటి చట్టవిరుద్ధ పనులు చేయలేదని స్పష్టం చేశారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం సర్వేల ద్వారా రాజకీయ ప్రత్యర్థుల మీద దురుద్దేశంతో ఈ చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.



## రైతన్నకు మోసం ఎందుకు?

- రెండు లక్షల రూపాయలు పైబడి అప్పు ఉన్నవారికీ రుణమాఫీ చేయాలి
- సేవాలాల్ సేన నేతల డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం,జులై 25 తొలి క్రాంతి:

రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వ మోసాన్ని వ్యతిరేకిస్తూ సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద "రైతు రుణమాఫీ దీక్ష" జరిగింది. జిల్లా అధ్యక్షుడు ధారావత్ సురేష్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ధారావత్ ప్రేమ్ చంద్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీక్షలో పాల్గొన్న నాయకులకు అనంతరం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేయడంతో పాటు, అక్కడి వేదికపై ప్రేమ్ చంద్ నాయక్ తీవ్ర విమర్శలు గుప్పించారు."రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని చెబితే, నేడు చేతులెత్తేసి మోసం చేస్తోంది. రెండు లక్షల రూపాయల కన్నా ఎక్కువ అప్పు ఉన్నవారికి మాఫీ వర్తించదని చెప్పడం అన్యాయమనే కాకుండా, రైతన్నలను దగా చేయడమే. వ్యవసాయాన్ని ప్రాణంగా నమ్ముకుని జీవిస్తున్న రైతులను విస్మరించడమే నిజమైన విశ్వాస ఘాతకత్వం" అని ధ్వజమెత్తారు.ప్రేమ్ చంద్ నాయక్ మాట్లాడుతూ %-% "రుణపుస్తకాల్లో అంకెలతో కాదు... రైతు కన్నీళ్లతో వ్యవసాయ చరిత్ర రాయబడుతోంది. మేము ఇది స్పష్టంగా చెబుతున్నాం రైతన్న మీద అప్పు ఎంత ఉన్నా, అతను కూడా రైతే. అందుకే ఎవరినీ వదలకుండా సంపూర్ణ రుణమాఫీ చేయాలి. అప్పులు తీరక, గిట్టుబాటు ధర రాక, ప్రభుత్వ ప్యాకేజీలు అందక... వేలాది మంది రైతులు బలవంతంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అయినా ప్రభుత్వంలో ఓ చలనం కనిపించడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎవ్వరూ స్పందించటం లేదు. ఇది దుర్మార్గం కాదు అంటే మరేం? "ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలతో వరాల వర్షం కురిపించినా... అమలులో మాత్రం నెత్తిన వాన పడినట్టయ్యిందని ఆయన ఎద్దేవా చేశారు. "రైతు రుణమాఫీ విషయంలో మేం తీవ్రంగా నిరసిస్తున్నాం. రెండు లక్షల రూపాయల కన్నా పైబడి అప్పు ఉన్న రైతులను మాఫీ యోజన నుండి మినహాయిస్తే, సేవాలాల్ సేన రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఉద్యమ కార్యాచరణలు చేపడుతుంది. ప్రభుత్వం దీన్ని తక్కువగా తీసుకుంటే ఆ పతనం ప్రారంభమవుతుంది" అని హెచ్చరించారు. ఈ దీక్షకు పలువురు కుల సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో సేవాలాల్ రైతు సేన రాష్ట్ర అధ్యక్షుడు భూక్య బద్రు నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవి రాథోడ్, ధర్మ జాగరణ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరుపల మంగీలాల్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి భానోత్ నాగరాజు నాయక్, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జరపల లాలు నాయక్, మండల అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నాయక్ (పాల్వంచ), వాంకుడోత్ రమేష్ నాయక్ (ఇల్లందు), బానోతు కిషన్ నాయక్ (టేకులపల్లి), బోడ బాలు నాయక్ (లక్ష్మీదేవిపల్లి), బానోతు లక్ష్మణ్ నాయక్ (జూలూరుపాడు), తేజావత్ సురేష్ నాయక్ (మణుగూరు), బోడ వీరేందర్ నాయక్ (భద్రాచలం), సభావత్ సీతారాం నాయక్ (బూర్గంపాడు), హాతిరం నాయక్, లావుడియా రమేష్ నాయక్, బోడ రవి నాయక్, లావుడియా చరణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. రైతన్న బతికితేనే దేశం బతుకుతుంది అని నినదిస్తున్న ఈ ప్రజాస్వామ్యంలో%ా% అదే రైతన్నను మోసం చేసే ప్రభుత్వం, నిష్క్రియంగా ఉన్న ప్రతినిధులు, మౌనంగా ఉన్న వ్యవస్థ అంటే మరిన్ని ఉద్యమాలు తప్పవన్న సంకేతాలను ఈ దీక్ష ఇచ్చింది.



## "ఓటు మాదే... ఢిల్లీ సింహాసనం కూడా మాదే!"

- గోవా జాతీయ ఓబీసీ మహాసభ విజయవంతానికి పిలుపు
- కులగణనతోనే హక్కుల సాధనకు బీసీల బలమైన ఉద్యమం
- ఈడబ్ల్యూఎస్ వల్ల అన్యాయం.. బీసీలకు జనాభా మేరకే కోటా కావాలి

హన్మకొండ, జూలై 25 తొలి క్రాంతి:

దేశవ్యాప్తంగా బీసీల సమస్యలు, హక్కుల సాధన కోసం ఆగస్టు 7న గోవాలో జరగనున్న జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరీ రవికృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. హన్మకొండ హరిత హోటల్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ ఆధ్వర్యంలో మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన, ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి బీసీ నేతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చాలని కోరారు. జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో నిర్వహించబోయే ఈ సభలో కులగణనపై కేంద్రాన్ని ఒత్తిడిచేసేందుకు కార్యాచరణ రూపుదిద్దనున్నట్లు తెలిపారు. గత మూడు దశాబ్దాల పోరాటంతో కులగణన దిశగా కేంద్రం కదలిక చూపడం గర్వించదగిన విషయం అయితేనూ, 2026 నాటికే పూర్తిగా పూర్తి చేసి, బీసీ మహిళలకు జనాభా మేరకే సబ్ కోటా కల్పించాలని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై తీవ్ర వ్యతిరేకత: కులగణన లేకుండా బీసీలను వంచిస్తున్న కేంద్రం, 50 శాతం సామాజిక రిజర్వేషన్ల పరిమితిని తొలగించి, బీసీలకు జనాభా మేరకే కోటా కల్పించాలని రవికృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వలన 10 శాతం ఉన్న అగ్రవర్ణాలు 50 శాతం ఉద్యోగాలను ఆక్రమిస్తున్నాయని, 56 శాతం పైగా ఉన్న బీసీలకు కేవలం 20 శాతం కూడా రాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తి వాళ్ళదా? లేదా శ్రమిచే మనదా?:ఈ దేశంలో ల్యాండ్, స్యాండ్, వైన్, మైన్, ఐటీ, పరిశ్రమలు అన్నీ అగ్రవర్ణాల చేతుల్లో ఉండగా, బీసీలకు సంక్షేమ పథకాలు, రాయితీలతో మత్తు కలిగిస్తున్నారని మండిపడ్డారు. "ఈ దేశం ఎవరిది? సంపద ఎవరిది?" అని ప్రశ్నించిన రవికృష్ణ గౌడ్, "ఓటు మాదే... సీటు మాదే... ఢిల్లీ పీఠం మాదే!" అనే నినాదంతో ఇకపై బీసీలు ముందుకు సాగాలని ప్రకటించారు.పలువురు నేతల సంఘీభావం: ఈ సమావేశంలో దాడి మల్లయ్య యాదవ్, భీమగాని యాదగిరి, వేముల మహేందర్ గౌడ్, తమ్మేలా శోభరాణి, మాదం పద్మజా దేవి, బూర్గుల ప్రమదాదేవి తదితరులు పాల్గొన్నారు.

# రాసే హక్కిచ్చి.. చదవే హక్కు తీసేశారా?

- అగ్రికల్చర్ డిప్లమా విద్యార్థులకు ప్రవేశ అనుమతి
- కానీ వెరిఫికేషన్ వద్ద తిరస్కరణ?
- విభ్రాంతి, ఆవేదనలో నెట్టేసిన టిటిసి అభ్యర్థులు
- రేవంత్ ప్రభుత్వం తలచుకోగలదా... న్యాయం చేయగలదా?

భద్రాద్రి బ్యూరో, జులై 25 తొలి క్రాంతి: టిటిసి ప్రవేశ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక స్పందన లభించింది. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన వేగవంతమైన డీఎస్సీ ప్రక్రియ చూసి... లక్షల మంది విద్యార్థులు టిటిసి కోర్సుల్లో కూడా అద్భుత మార్పులు వస్తాయని ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇప్పుడు అధికారుల తీరుతో వారి కలలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. అగ్రికల్చర్ డిప్లమా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు అప్లికేషన్ సమయంలో టిటిసి ప్రవేశ పరీక్ష రాసేందుకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం... ఇప్పుడు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ సమయంలో "ఇది అర్హత కాదని" చెప్పడం విద్యార్థుల్ని భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఒకే ప్రభుత్వం, ఒకే నియమాలు... కానీ రెండు రకాల తీరు. ఇది ఎంతగా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమేనో అధికారులెరిగాలి. పరీక్షకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం సీటు ఇచ్చే సమయంలో వెనకడుగు వేయడాన్ని విద్యార్థులు తట్టుకోలేకపోతున్నారు.

మంచి ర్యాంకులు తెచ్చుకున్నా, అర్హత లేదంటూ



ఇంటికి పంపించడమంటే అది న్యాయమా? ఇదే ప్రశ్న రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తోంది. అధికారుల తడబాటు వల్లే లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. చదివి ఎదగాలన్న ఆశతో తల్లిదండ్రుల కష్టాలను తినే పిల్లలు ఇప్పుడు కన్నీటితో సమాధానం చూస్తున్నారు. తాము చేసిన చదువు తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా అన్ని జిల్లాల్లో ఇదే బాధ. ఎంట్రన్స్‌కు ఓకే చెప్పిన ప్రభుత్వమే వెరిఫికేషన్ వద్ద మోకాలిలా కూల్చడం విడ్డూరంగా మారింది. టిటిసి అవకాశం కోసం అగ్రికల్చర్ డిప్లమా విద్యార్థులు నిరీక్షిస్తున్నారు. "న్యాయం కావాలి" అనే వారి చిట్కారాలు ప్రభుత్వాన్ని తాకాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, అగ్రికల్చర్ డిప్లమా విద్యార్థులకు న్యాయం చేస్తేనే వారి ఆశలు నెరవేరతాయి. లేకపోతే... చదువు పట్ల ఉన్న నమ్మకమే మరుగున పడుతుంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల కలిగిన అన్యాయం రాష్ట్ర భవిష్యత్తునే దిగజార్చే ప్రమాదం ఉందని మేధావులు హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల కన్నీళ్లు కనిపించాలి... న్యాయం వర్షించాలి. ఒక అవకాశం ఇచ్చిన మీరు.. వారి అవకాశాలను హరిస్తే అది జనాధికారం కాదు.. అన్యాయం.



## ఊకే వీరాస్వామి ఇకలేరు

- సీపీఐ(ఎం)కి చిరస్మరణీయ సేవలిచ్చిన నాయకుడి మరణం
- పార్టీ పతాకంతో వీరస్వరూపానికి వీడ్కోలు

అశ్వరావుపేట, జులై 26 తొలి క్రాంతి: సీపీఐ(ఎం) పార్టీకి మార్మోగిన నినాదాలు, గ్రామ రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచిన సీనియర్ నాయకుడు ఊకే వీరాస్వామి (84) శుక్రవారం ఉదయం వయోభారంతో తుదిశ్వాస విడిచారు. రెండు పదవీకాలాల పాటు నందిపాడు గ్రామ సర్పంచ్‌గా సేవలందించిన ఆయన, జీవనాంతం వరకు ప్రజా ఉద్యమాలకు అంకితంగా మిగిలారు. వీరాస్వామి భౌతికదేహానికి సీపీఐ(ఎం) పార్టీ పతాకాన్ని కప్పి ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరం కనకయ్య భౌతికకాయంపై పార్టీ జెండా ఉంచి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "వీరాస్వామి ప్రజల కోసం నిత్యం పోరాడిన ఓ బహుముఖ ప్రజా నేత. సమాజ మార్పుకు ఆయన చూపిన దారి పదవ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. ఇక, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, అన్నవరం సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు అర్జున్, చిరంజీవి తదితరులు నివాళులు అర్పించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీరాస్వామి కుటుంబానికి సంఘీభావం తెలిపారు. వీరాస్వామికి భార్య బుల్లెమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పార్టీ, గ్రామం, కుటుంబం... మూడు రంగాల్లోనూ సమానంగా గౌరవం పొందిన వీరాస్వామి మృతితో ప్రజల గుండెల్లో తీరని లోటు ఏర్పడిందని పలువురు అన్నారు.



## గగనవిజయం చైతన్య విద్యార్థులది

- నాసా ప్రాజెక్టు పోటీల్లో జాతీయ స్థాయిలో మూడో స్థానం
- రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి.. ఘనంగా సన్మానం

పాల్వంచ, జులై 25 తొలి క్రాంతి: కాంటాక్ట్స్ కాలనీలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు అమెరికన్ అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా నిర్వహించిన ప్రాజెక్టు రూపకల్పన పోటీల్లో ప్రఖ్యాతిని అందుకున్నారు. స్నిగ్ధా, కార్తికేయ వి.ఆకర్ష, తులసిరాజు, ఏ.యోగ, హనీఫ్ కె.మైథిలి, గాయత్రి, అయానుద్దీన్ ఎండి అనే విద్యార్థులు గ్రూపుగా ఏర్పడి "స్పేస్ కాలనీ" ప్రాజెక్టును రూపొందించారు. ఈ ప్రాజెక్టు జాతీయ స్థాయిలో మూడో బహుమతిని, రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమ్య మాట్లాడుతూ.. విద్యార్థులు తమ విజ్ఞానాన్ని నైపుణ్యంగా వినియోగించి ఈ ఘనత సాధించారని, ఇది పాఠశాలకే గర్వకారణమన్నారు. విజయం వెనుక తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల, విద్యార్థుల కృషిని కొనియాడారు. విజేతలకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎన్ మధు, సి ఇంచార్జ్ నాగబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, డిటిపి ఆపరేటర్ నరసింహారావుతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆన్లైన్‌లోనే భూ భారతి దరఖాస్తులు

- ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచన
- స్వీకరించిన ప్రతీ దరఖాస్తుపై నోటీసులు ఇవ్వాలి

ఖమ్మం, జులై 25 తొలి క్రాంతి: భూ సమస్యల పరిష్కారానికి స్వీకరించిన దరఖాస్తుల ఆన్లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. కామేపల్లి, సింగరేణి తహసీల్దార్ కార్యాలయాల్లో తనిఖీ నిర్వహించిన ఆయన, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి పోర్టల్‌లో నిబంధనల మేరకు నోటీసులు జారీ చేసి, నిర్ణయాలు తేల్చాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ తనిఖీలో తహసీల్దార్లు సిహెచ్.సుధాకర్, ఏ.రమేష్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## తేనెటీగలతో మారిన జీవితం

- ప్రకృతికి తోడుగా నిలిచిన శిక్షణ
- మహిళలకు ఆత్మవిశ్వాసం.. కుటుంబాలకు ఆదాయ మార్గం
- ఉపాధి కాదు.. గౌరవప్రదమైన జీవన రీతి



కొత్తగూడెం, జులై 25 తొలి క్రాంతి: కొత్తగూడెం ప్రాంతంలోని జికెఓసి, వీకే బొగ్గు గనుల ప్రభావిత గ్రామాల మహిళల కోసం చేపట్టిన తేనెటీగల పెంపకం శిక్షణా కార్యక్రమం విజయం సాధించింది. సింగరేణి సంస్థ తన సామాజిక బాధ్యతలో భాగంగా మనబ్ కళ్యాణ్ సంక్షేమ సంఘం, త్రిపుర సహకారంతో ఈ శిక్షణను మూడు రోజులపాటు నిర్వహించింది. మొత్తం 100 మంది మహిళలు పాల్గొన్న ఈ శిక్షణ రుద్రంపూర్‌లోని క్లబ్‌లో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో కొత్తగూడెం విభాగ అధికారి పాల్గొని మాట్లాడుతూ.. తేనెటీగలు ప్రకృతికి రక్షణగా, పంటలకు పరాగసంపర్కంతో దిగుబడులు పెరిగేలా చేస్తాయని, ఇది రైతులకు ఆదాయ మార్గమే కాకుండా పర్యావరణానికి మేలు చేసే సుస్థిర వ్యవసాయ పద్ధతిగా అభివర్ణించారు. శిక్షణ పొందిన ప్రతి మహిళకు ఉచితంగా తేనెటీగల పెట్టె, ముఖ రక్షణ కవచం, గ్లౌజులు, సంరక్షణ పరికరాలు అందిస్తారు. అంతేకాదు, వీరికి రెండు సంవత్సరాలపాటు సాంకేతిక మార్గదర్శకత్వం అందించేందుకు ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు తమ ఇళ్ల వద్దే తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయాన్ని పొందే అవకాశాన్ని సృష్టించుకున్నారు. ఇది వారికి ఆర్థిక స్వావలంబనతో పాటు గౌరవభరితమైన జీవనశైలిని అందిస్తుందని, వారి కుటుంబాల అభివృద్ధికి ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతంలోని యూనియన్ నాయకులు, అధికారులు, శిక్షణకారులు, మహిళలు పాల్గొన్నారు.



## జరభద్రం.. పెయిడ్ నాయకత్వం!

- పైసలకోసం పార్టీలు ఎక్కిపోతున్న నేతలు
- కేసుల్లో కూరుకుపోయే కార్యకర్తలు నిరాశలో
- నమ్మకాన్ని ముంచే డబ్బుదండా నేతలతో పార్టీలు మునిగే ముప్పులో



అశ్వరావుపేట, జులై 25 తొలి క్రాంతి: జనసమ్మతికి బదులు జెబ్ సమ్మతంగా రాజకీయాలు మారుతున్నాయి. పార్టీలు గెలుపు కోసం ఆలోచించకుండానే డబ్బున్నవారిని వేటాడుతుండటం, వారిని పదవుల వరదతో ఆకట్టుకోవడం పెరిగిపోయింది. ఈ ధోరణి పల్లెల్లోని ఓ కార్యకర్త మనోభావాలను చీల్చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో ముఖ్యంగా ఎస్టీ రిజర్వ్ ప్రాంతాల్లో ముప్పుతప్పకుండా 'పెయిడ్ జంపర్ల' వేట మొదలైందనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఒకప్పుడు పార్టీ జెండాను ఆరిపోకుండా పట్టుకున్న నాయకులు, ఇప్పుడు వాటిని అమ్మకానివ్వకుండా చూస్తున్నారు. కానీ కొత్తగా వచ్చిన పెయిడ్ నేతలు మాత్రం... డబ్బుతో పార్టీని కొనేసి, అంకితభావంతో పనిచేసే కార్యకర్తల్ని పక్కన నెట్టి పదవులు కాజేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా కేసుల్లో కూరుకుపోయి పార్టీ కోసం తానూ ఆస్తులను అమ్ముకున్న కార్యకర్తలకు మాత్రం ఒక్క మాట ప్రశ్నిస్తే "డబ్బున్నాడు కదా.. మా దేనికి!" అన్న మాదిరిగా సమాధానం వస్తోంది. ఇదే మానసిక బాధ, ఇదే మనోవేదన. ఇక అశ్వరావుపేట నియోజకవర్గం నుండే ఈ విషం మొదలై జిల్లావ్యాప్తంగా వ్యాపించిందని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఎవరో డబ్బు పెట్టాడు, అతడికి ఇన్చార్జి పదవి, మరొకడికి ఎమ్మెల్యే టికెట్ హామీ... ఇదే క్రమంలో అసలైన నమ్మకస్తులు తలదించుకుని నిశ్శబ్దంగా కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధిష్టానం తక్షణమే స్పందించకపోతే ఈ పెయిడ్ నాయకత్వం కారణంగా పార్టీలు తీరని మూల్యం చెల్లించాల్సి రావచ్చని కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. పార్టీలో చేరే వ్యక్తి గత చరిత్రను, నైతిక విలువలను, కార్యకర్తల మధ్య ఉన్న నమ్మకాన్ని పరిశీలించకుండా కేవలం డబ్బున్నాడు, సామర్థ్యం ఉందంటూ తీసుకొస్తే నమ్ముకున్నవారంతా వదిలి పెట్టి పోవడం ఖాయం. ఈ పెయిడ్ నేతలు పక్క పార్టీకి వెళ్లిపోతే మాత్రం... వాళ్లతో పాటే కార్యకర్తల గౌరవం, పార్టీ పేరు కూడా నశిస్తుంది. ఇది గతంలో అనేకసార్లు కనిపించిన సత్యం. డబ్బు చూసి నాయకత్వం ఇవ్వడం కంటే నిజంగా పార్టీ కోసం పనిచేసినవారికి, ప్రజలతో సంబంధాలు ఉన్నవారికి అవకాశాలు కల్పిస్తేనే పార్టీ బతికిపోతుందని నేటి గ్రామీణ కార్యకర్త వేదనతో కోరుతున్నాడు. ఒక్కో నియోజకవర్గంలో నాలుగైదు మంది పెయిడ్ నాయకులు పార్టీని ఓడించేందుకు కుట్రలు చేస్తున్నారని గుసగుసలంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో... పైసల కోసం పార్టీలను ఎక్కే నాయకులతో జరభద్రం సుమీ! పార్టీ అధిష్టానం చెమటలు పట్టేలా స్పందించి, అసలైన నాయకత్వాన్ని వెలికి తీసే దిశగా అడుగులు వేయాలని కార్యకర్తలు కోరుతున్నారు. లేదంటే పార్టీకి ఒక్క జెండా పట్టేవాళ్లు కూడా మిగలరన్నది కడుగట్టిన వాస్తవం.

## కల అయినా.. కార్డు అయినా! ఎన్నేళ్ల నిరీక్షణకు ముగింపు

- కొత్తగా 4,633 కార్డులు, వేల కుటుంబాలకు ఊరట
- సన్న బియ్యం.. పేదవారి ఆకలి తీర్చే దిక్సూచి

పాల్వంచ, జులై 25 తొలి క్రాంతి: కొత్తగూడెం నియోజకవర్గంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. కొత్తగూడెం క్లబ్, పాల్వంచ కనకదుర్గ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ హాజరయ్యారు. ఎన్నేళ్లుగా ఎదురుచూస్తున్న పేదవారి కల నేడు నిజమైందని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఆగిపోయిన పంపిణీని ప్రస్తుత ప్రభుత్వం సమర్థంగా పునఃప్రారంభించిందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో మొత్తం 4,633 కొత్త కార్డులు మంజూరు కాగా, 7,962 కార్డుల్లో కుటుంబ సభ్యుల వివరాలు నవీకరించారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్కువ సమయంలోనే కార్డులు మంజూరు చేశామని, మరింత సమాచారం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారిని రుక్మిణి, సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ఇల్లు కల కాదు.. హక్కు!

- 24వ డివిజన్‌లో 15 మందికి పట్టాల పంపిణీ
- పూర్తి సబ్సిడీతో రూ.5లక్షల సహాయం

ఖమ్మం, జులై 25 తొలి క్రాంతి: సొంత స్థలం ఉన్న ప్రతి పేదవాడు ఇంటి కలను నిజం చేసుకునే రోజులు వచ్చాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద కొత్తగా ఇల్లు నిర్మించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. 24వ డివిజన్‌లో 15 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను బోనకల్ క్రాస్ రోడ్ వద్ద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ కమర్తపు మురళి చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాలు అందుకున్న ప్రతి లబ్ధిదారుడికి రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో పూర్తి సబ్సిడీతో ఇల్లు నిర్మించుకునే అవకాశం ఉందని తెలిపారు. మంజూరైన ఆదేశాల ప్రకారం, 45 రోజుల్లో ఇంటి నిర్మాణం ప్రారంభించి ఒక సంవత్సరంలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగులుండి, గరిష్ఠంగా 600 చదరపు అడుగులు మించకూడదు. రెండు గదులు, వంటగది, మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలి. ఆర్.సి.సి స్లాబుతో ఇంటిని నిర్మించాలి. ఇంటిని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే, మంజూరు రద్దుచేసి అప్పటివరకు చెల్లించిన మొత్తాన్ని తిరిగి వసూలు చేస్తామని స్పష్టం చేశారు. నిర్మాణ దశలవారీగా ప్రభుత్వం అందించే సాయం ఈ విధంగా ఉంటుంది:

బేస్మెంట్ అనంతరం –రూ.1,00,000
గోడలు అనంతరం – రూ.1,00,000
స్లాబ్ అనంతరం – రూ.2,00,000
పూర్తిస్థాయి ఇంటి తర్వాత రూ.1,00,000 (మరుగుదొడ్డి, ప్లాస్టరింగ్, తలుపులు సహా)

ఈ కార్యక్రమంలో గంగిశెట్టి శ్రీనివాస్, షేక్ గౌస్, నాగాటి చంద్రశేఖర్, రేఖ లక్ష్మణ్, వరద వెంకన్న, సురపనేని సురేష్, పోలూరి నాగార్జున, మునిశెట్టి మహేష్, మహిళా నాయకురాలు రేఖ భార్గవి, మరికంటి అనుష, జోయ, పొనుగోటి స్వప్న తదితరులు పాల్గొన్నారు.



## స్కూల్ బ్యాగుల తోడు

- పేద పిల్లలకు లైఫ్ స్టైల్ షాప్ సాయంతో బహుమతులు

కొత్తగూడెం, జులై 25 తొలి క్రాంతి: చిట్టి రామవరం స్కూల్ విద్యార్థులకు లైఫ్ స్టైల్ షాప్ వితరణగా ఇచ్చిన స్కూల్ బ్యాగులను మాజీ కౌన్సిలర్ భూక్య శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉష అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడిన శ్రీనివాస్ "ఈ పోటీ ప్రపంచంలో సంపాదించేది దాచుకునే రోజుల్లో, పేద పిల్లల కోసం స్కూల్ బ్యాగులు ఇవ్వాలన్న ఆలోచన, దానిని ఆచరించిన సంస్థ యాజమాన్యం నిజంగా అభినందనీయం" అన్నారు. సంస్థ అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ, తన తరఫున, విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు ప్రిస్కిల్లా, కిషన్, అంగన్వాడి టీచర్లు శ్రీదేవి, తులసి పాల్గొన్నారు.





తొలిక్రాంతి
శనివారం
26 జులై 2025





# పట్టుదల ఉంటే చదువు మార్గం మనదే!

- పోటీ పరీక్షలకే కాదు, జీవితానికే సిద్ధం కావాలి
- సంకల్పం ఉంటే ప్రభుత్వ విద్యతోనే సీటు, ఉద్యోగం సాధ్యం
- కాలేజీ గోడలకే కాదు, మానసిక గోడలకూ తిరుగులేని సందేశం

నేలకొండపల్లి, జులై 25 తొలి క్రాంతి:

"మన జీవితం ఎలా ఉండాలనేది మనమే నిర్ణయించాలి" అని విద్యార్థులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి. శుక్రవారం ఆయన నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. తరగతుల వద్ద విద్యార్థులతో మమేకమవుతూ.. చదువు మీద పట్టుదల, పోటీ పరీక్షలపై సన్నద్ధత ఉంటే ఏదైనా సాధ్యమేనన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నేర్చుకుని, పోటీ పరీక్షల వలన బిట్స్ బిలానీ వంటి ప్రఖ్యాత విద్యాసంస్థలో చదివిన విషయాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. "కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోకండి... ఒత్తిడిని తట్టుకుంటేనే వజ్రం తయారవుతుంది" అన్నారు. ఇంటర్ బోర్డు పరీక్షలతో పాటు జేఈఈ, నీట్ వంటి పరీక్షలకు సమాంతరంగా సిద్ధం కావాలని సూచించారు. "పాఠాలు శ్రద్ధగా వింటే, సిలబస్ రెగ్యులర్‌గా చదివితేనే విజయం సాధ్యం" అని హితబోధ చేశారు. వారం రోజుల్లో కావాల్సిన పుస్తకాలను అందుబాటులోకి తేవడం, విద్యార్థుల అవసరాలకు ప్రభుత్వం తరఫున సహకారం అందించడంపై అధికారులను ఆదేశించారు. "రిల్స్ చూడడం కాదు... కాన్సెప్ట్ నేర్చుకోవడమే ముఖ్యమని" స్పష్టంగా చెప్పారు. కలెక్టర్ పర్యటనలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





# వర్షాల వేళ.. జాగ్రత్తే ఆయుధం!

- ఆసుపత్రులపై కలెక్టర్ దాడి
- అప్రమత్తం కావాలని హెచ్చరిక
- జ్వరాలపై పరీక్షలు తప్పనిసరి
- ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరగాలి
- మందుల నిల్వలు, సేవలపై కలెక్టర్ సమీక్ష

ఖమ్మం, జూలై 25 తొలి క్రాంతి:

వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఆరోగ్య కేంద్రంలో నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ఈ మేరకు ఆయన నేలకొండపల్లి మండలంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్ చికిత్సాలయాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫార్మసీ, పరీక్ష గదులు, ఓపి, ల్యాబ్, గర్భిణీ సేవలు, రోగుల వార్డులు, పురుష, మహిళా విభాగాలను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, అవసరమైన మందులు, పరీక్షల పరికరాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారికి వెంటనే పరీక్షలు జరగాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు ఎక్కువగా జరిగేలా, తొలినుంచి సాధారణ ప్రసవం వైపు ప్రోత్సహించాలన్నారు. అనవసర శస్త్రచికిత్సలు తగ్గించేందుకు వైద్యులు, ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ తనిఖీల్లో తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







# నిద్ర కరువై.. దోమల రాజ్యం!

- పిచ్చి మొక్కలు, మురికినీరు.. శుద్ధి లేని వాతావరణం
- దోమల దెబ్బకు జ్వరాలు, వైద్య సహాయం అందని దుస్థితి
- పంచాయతీలు మూతపడి ప్రజలు వేదనలో

భద్రాద్రి బ్యూరో, జులై 25 తొలి క్రాంతి:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అనేక గ్రామాల నుంచి పట్టణాల వరకూ ఒకే రూపం కనిపిస్తోంది. వరుస వర్షాల వల్ల పిచ్చి మొక్కలు కమ్ముకొని, మురికి నీళ్ల వల్ల దోమలు విపరీతంగా పెరిగాయి. ఈ దోమల దాడితో ప్రజలు రాత్రుళ్లు నిద్రలేని యాతనకు లోనవుతున్నారు. ఇంకా చెత్త చెదారంతో నిండిన వీధులు, నల్లటి నీరు నిలిచిన రోడ్లు, మొక్కల అడవిలా మారిన ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలు–ఇవన్నీ దోమల పుట్టలుగా మారాయి. కానీ దీన్ని ఆపే విధంగా గ్రామ పంచాయతీలు, స్థానిక అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పంచాయతీ కార్యాలయాలకి తాళం పడినట్టు కనిపిస్తోంది. పిచికారీ లేదు, శుద్ధి చర్యలూ కనిపించవు. దోమల దెబ్బతో ప్రజలు జ్వరాలకు గురవుతున్నారు. కానీ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది లేదు. మందులు దొరకడంలేదు. ఆరోగ్య శిబిరాల నిర్వహణ లేదు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని పట్టించుకునే వారు ఎవరూ కనిపించడం లేదు. దోమతెరల పంపిణీ కూడా పూర్తిగా ఆగిపోయిం ది. ఎక్కడా కనపడడం లేదు. చెత్తతో నిండిపోయిన డ్రైనేజీలు, నిలిచిపోయిన వర్షపు నీళ్ళు దుర్వాసనలు పెంచుతూ మానవులకు తట్టుకోలేని ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ దుస్థితిని తేలికగా చూడరాదు. ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నది ఒక్కటే–దోమల ఉధృతి తక్షణమే నియంత్రించాలి. వైద్య శిబిరాలు నిర్వహించాలి. దోమతెరల పంపిణీ చేపట్టాలి. గ్రామాలలో శుద్ధి పనులు చేపట్టి, చెత్త తొలగించాలి. ట్రాక్టర్లతో పారిశుధ్య చర్యలు తక్షణం ప్రారంభించాలి. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే, ప్రజల ఆరోగ్యమే కాదు... పాలనా వ్యవస్థ పట్ల విశ్వాసం కూడా పతనమవుతుంది. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే– దోమల రాజ్యంలో మనుషుల బాధ ఎవరు వినాలి?



# తల్లి ఆలయం.. తీరని అభివృద్ధి ఆశ!

- ప్రభుత్వాన్ని చూస్తూ ఎదురు చూపులు
- రద్దీ పెరుగుతోంది.. సరసమైన సౌకర్యాలు లేవు
- నూతన ప్రభుత్వంపై భక్తుల నమ్మకం

అశ్వారావుపేట, జూలై 25 తొలి క్రాంతి:

## తల్లి ఆలయం దీవిస్తుంది.. ప్రభుత్వ ఆశీస్సు ఎప్పుడొస్తుందో?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురంలో వెలసిన శ్రీశ్రీశ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి దేవస్థానం పట్ల భక్తుల భక్తి ఎంతో ఉన్నతంగా ఉంది. శనివారం, ఆదివారాల్లో హోమాలు, ప్రత్యేక పూజలతో ఆలయం కిటకిటలాడుతోంది. అమ్మవారి కరుణకు లక్షలాదిమంది మంది తలవంచుతూ.. కోరికలు కోరుతూ తిరిగి నెరవేరినవారు తిరిగొచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. అయితే.. అంతటి ప్రాచుర్యం ఉన్న ఆలయానికి ఇప్పటికీ కనీస సౌకర్యాలు లేకపోవడం భక్తులను ఆవేదనలో ముంచుతోంది. నీటి సదుపాయాల కొరత, శౌచాలయాల సమస్య, ఆలయ అభివృద్ధిలో అంతం తమాత్రం గానే ఉన్నట్లు చర్చలు సాగుతున్నాయి. వేలాదిమంది వస్తున్నారు... ఎవరు చూస్తున్నారు?ప్రతి ఆదివారం వేలాది మంది తరలివస్తున్నా.. అభివృద్ధికి మాత్రం ఎవరూ శ్రద్ధ చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు గుడి గొప్పతనాన్ని విస్మరించాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా యువ ఎమ్మెల్యేలు, మంత్రులు ఈ ఆలయం వైపు దృష్టి పెట్టాలన్నది భక్తుల గుండెవేదన. ముత్యాలమ్మ ఆశీర్వాదం అందరికీ... పాలకులే వెనుకబడినవారు!తల్లిని ముద్దుగా పిలుచుకునే భక్తులు ఆలయం చుట్టూ పరిసరాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. స్వయంభుగా వెలసిన ఈ ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించి... రహదారి, బస్ షెల్టర్, విరామ గృహాలు, శౌచాలయాల నిర్మాణం చేపడితే భక్తులకు గొప్ప అనుభూతి కలుగుతుందని అంటున్నారు. తల్లి వద్ద ఆశలతో వచ్చే ప్రజలు.. ఆలయ అభివృద్ధికి ఆలయ కమిటీ ఎంతగానో కృషి చేస్తోంది కానీ, ప్రభుత్వ సహకారం లేక అభివృద్ధి కాస్త మందగిస్తోంది. కనీసం నూతన ప్రభుత్వం అయినా తల్లి ఆశీస్సులతో అభివృద్ధి పట్ల చొరవ చూపాలన్నది భక్తుల ఆకాంక్ష. మంత్రివర్గ సభ్యులు స్వయంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని, అవసరాలు గుర్తించి నిధులు విడుదల చేస్తే ఆలయం కూడా అభివృద్ధి బాటలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించే స్థానం ఉంది కానీ... భక్తులకి కూర్చొనే చోటు లేదు. భక్తుల ఈ వేదన ప్రభుత్వాన్ని కదిలించాలని కోరుతూ.. "తల్లి మనది, అభివృద్ధి మీది" అంటున్నారు వినాయకపురం గ్రామస్థులు.



# ఉసిరిలో ప్రాణాలు!

- ఊరుకోకుండా ప్రతి జ్వరం కేసును వెంటాడాలి
- వైద్య సిబ్బంది కట్టుదిట్టంగా పని చేయాలి
- అదనపు కలెక్టర్ హెచ్చరిక
- పరిశుభ్రత లేనిదే అధికారులపై బాధ్యత

ఖమ్మం, జూలై 25 తొలి క్రాంతి: ప్రతి జ్వరం కేసును వెంటాడాలని, చికిత్స అందించడంతో పాటు సంబంధిత ప్రాంతాల్లో ఫీవర్ సర్వేలు, ఫాగింగ్ నిర్వహించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. ఆశా కార్యకర్తల వద్ద నిర్ధారణ కిట్లు సిద్ధంగా ఉండాలని, అవసరమైతే వెంటనే పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో దోమలు పెరగకుండా గుంతలలో ఆయిల్ బాల్లు వేయాలని, త్రాగునీటిని క్లోరిన్ కలిపి పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో నమోదయ్యే జ్వరం కేసుల సమాచారం సంబంధిత శ్రేణికి అందాలని, చికిత్సను వాయిదా లేకుండా అందించాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, వసతి గృహాల్లో పారిశుధ్య పనులు తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. వైద్యశిబిరాలు, మందుల నిల్వలు సిద్ధంగా ఉంచాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణలో నిర్లక్ష్యానికి తావు లేదని హెచ్చరించారు. ఈ సమీక్షలో జిల్లా అధికారులు, వైద్యశాఖ అధికారులు, పంచాయతీ అధికారులతో పాటు సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.






# కనీస వేతనం ఇవ్వండి!

- ప్రభుత్వ ఆసుపత్రుల కార్మికులకు 26 వేల వేతనం ఇవ్వాలని టియుసిఐ డిమాండ్
- జూలై 31న కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా పిలుపు
- జీవో 282 రద్దు చేయాలి
- ప్రతినెల జీతాలు చెల్లించాలి

ఇల్లందు, జులై 25 తొలి క్రాంతి:

ఇల్లందు ప్రభుత్వ దవాఖానాలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనంగా రూ.26,000 ఇవ్వాలని టియుసిఐ రాష్ట్ర మహాసభలు డిమాండ్ చేశాయి. ఆసుపత్రిలో డిసిహెచ్ రవి బాబుకు వినతిపత్రం అందజేసిన పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు జీవో 282 రద్దు చేసి, పీఎఫ్ పెన్షన్ కనీసం రూ.9,000గా నిర్ణయించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడమే కారణమని ఆరోపించారు. ప్రభుత్వం రూ.15,600 జీతం ఇవ్వాలన్న సర్క్యులర్ ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. బ్లీచింగ్, మెటీరియల్ ఖర్చుల నిమిత్తం కార్మికుల జీతాలే కత్తిరిస్తున్నారని విమర్శించారు. కనీస వేతనాలపై ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ జూలై 31న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొనాలంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్ నివాస్, సూపర్వైజర్ రమణ, యూనియన్ నాయకులు వేముల గురునాథం, ఝాన్సీ రవి, కృష్ణవేణి, సునీత, లలిత తదితరులు పాల్గొన్నారు.



# గెలిచిన గౌరవం

- జాతీయ అవార్డు పొందిన కాశీ హుస్సేన్
- మార్షల్ ఆర్ట్స్‌లో 35 ఏళ్ల సేవ
- ఇంకా ఎన్నో అవార్డులు అందాలనే ఆకాంక్ష

కొత్తగూడెం, జులై 25 తొలి క్రాంతి:

విజయవాడలో జరిగిన నేషనల్ స్టార్ ఎక్సలెన్సీ అవార్డును మార్షల్ ఆర్ట్స్ రంగంలో కుంగ్ ఫూ మాస్టర్ పెదపాటి కాశీ హుస్సేన్ అందుకున్నారు. సినిమా నటుడు భానుచందర్ చేతుల మీదుగా ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా కుంగ్ ఫూ మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాశీ హుస్సేన్‌ను ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు ఆదినారాయణ మాట్లాడుతూ.. "కాశీ హుస్సేన్ మార్గదర్శనంలో ఎన్నో మంది క్రీడాకారులు నిలిచారు. ఆయన మరిన్ని గౌరవాలు పొందాలి" అన్నారు. సలహాదారు దస్తగిరి, అధ్యక్షులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, మల్లికార్జున్, రాజా, కే. రాజు తదితరులు పాల్గొన్నారు.



# శిక్షణే శక్తి.. ఉపాధే లక్ష్యం

- తాకులపల్లి ఐటీఐలో పరిశ్రమలతో సమన్వయ సమావేశం
- స్థానిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల రూపుదిద్దే ఆరంభం
- వీవీసీ మోటార్స్ సంస్థ ఉద్యోగ హామీ

ఖమ్మం, జులై 25 తొలి క్రాంతి:

తాకులపల్లి ప్రభుత్వ ఐటీఐలో టి–గేట్ కార్యక్రమం కింద పరిశ్రమలతో సమన్వయ సమావేశం జరిగింది. రైస్ మిల్లులు, గ్రానైట్ పరిశ్రమలు, చక్కెర కర్మాగారాలు, చాంబర్ ఆఫ్ కామర్స్, వీవీసీ మోటార్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశానికి జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్ బాబు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కృష్ణవేణి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మాధవి హాజరయ్యారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, విద్యార్థులలో ఉన్న లోపాలు, వాటిని అధిగమించేందుకు శిక్షణ మార్గాలపై విస్తృతంగా చర్చ జరిగింది. వీవీసీ మోటార్స్ సంస్థ ఈ ఏడాది ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ ట్రేడ్ విద్యార్థులకు 100 శాతం ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రకటించింది. ఐటీఐతో ఒప్పందానికి సిద్ధంగా ఉందని తెలియజేసింది. ఇలాంటి సమావేశాల ద్వారా పరిశ్రమ%–%విద్యా వ్యవస్థల అనుసంధానం బలపడుతుందని, విద్యార్థుల భవిష్యత్తు దిశగా ఇది నూతన అధ్యాయం కావాలని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. టి–గేట్ కమిటీ సభ్యులు అనంతరం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

